సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం। 11। డిసెంబర్। 2023



సమష్టిగా.. స్వావలంబన

డ్వాక్రా రుణసాయంతో చిరు వ్యాపారాలు చేపట్టి సమష్టిగా పనిచేస్తూ స్వావలంబన దిశగా సాగుతున్నారు కోపల్లె మహిళలు.

8లో



కాపులకు గుర్తింపు

కాపులను గుర్తించి వారి ఆత్మగౌరవం పెంచేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కారుమూరి అన్నారు.

8లో



పిల్లలను చదివించాలి

కాపులు తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు.

8లో

న్యూస్‌రీల్

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ఎ.వీరయ్యచౌదరి, జిల్లా ప్రజారవాణా అధికారి

భీమవరం (ప్రకాశం చౌక్) : జిల్లాలోని నాలుగు డిపోల నుంచి పంచారామ దర్శిని, ఏకాదశరుద్రుల యాత్ర, శివకేశవ దర్శిని, అరుణాచలం, మన్యసీమ దర్శిని వంటి యాత్రలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి తెలిపారు. అలాగే శబరిమలైకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా సర్వీసులకు స్పందన బాగుందని చెప్పారు. వీడియో కోచ్ హైటెక్ బస్సులు, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులను ప్రయాణికుల కోరిక మేరకు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే భక్తుల కోరిక మేరకు ఇతర ప్రాంతాలకు కూడా బస్సులు నడుపుతామని, అనుభవజ్ఞులైన డ్రైవర్లు ఉన్నారని ఆయన అన్నారు.

అరుణాచలం : ప్రతినెలా పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోరిక మేరకు అరుణాచలం యాత్ర బస్సులను ప్రారంభించారు.

పంచారామ దర్శిని : దాక్షారామ, సామర్లకోట, పాలకొల్లు, భీమవరం, అమరావతి పంచారామాలకు వెళ్లేలా పంచారామ దర్శిని పేరుతో బస్సులు నడుపుతున్నారు.

శివకేశవ దర్శిని : ముక్తేశ్వరం, కుండలేశ్వరం, మురమళ్ల, అప్పనపల్లి, అంతర్వేది, పాలకొల్లు క్షేత్రాలు.

ఏకాదశి రుద్రుల యాత్ర : వ్యాఘేశ్వరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, పాలగుమ్మి, మొసలపల్లి, ముక్కామల, నేదునూరు, వక్కలంక, ఇరుసుమండ క్షేత్రాలు

మన్యసీమ దర్శిని : కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, సీతపల్లి బాపనమ్మ గుడి, మారేడుమిల్లి కాఫీ గార్డెన్స్, మిరియాల గార్డెన్స్, రబ్బరు ప్లాంటేషన్, జలతరంగిణి (జలపాతాలు), వ్యూ పాయింట్, పాములేరు వాగు, రాజమండ్రి ఇస్కాన్ టెంపుల్, పుష్కరాల రేవు.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి



మాట్లాడుతున్న జేడీ జయప్రకాష్

చింతలపూడి : పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాల సాధనకు విద్యార్థులతో పాటు హాస్టల్ వార్డెన్లు కృషి చేయాలని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ పిలుపునిచ్చారు. స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిపుణులైన ఉపాధ్యాయులచే అన్ని సబ్జెక్టుల్లో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. శిక్షణా తరగతులకు ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని స్పెషల్ హాస్టళ్ల నుంచి 210 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా బీసీ డబ్ల్యూఓ ఆర్‌వీ నాగరాణి, సహాయ సాంఘిక సంక్షేమాధికారి రత్నకుమార్, వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న సివిల్ జడ్జి సురేష్‌బాబు

భీమవరం: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమవరం ప్రత్యేక ఉప కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి మనిషీ హక్కులను కలిగి ఉంటాడని, అవి భారత రాజ్యాంగంలో పార్ట్-3లో పొందుపరిచారన్నారు. కులం, మతం, ప్రాంతం, స్త్రీ, పురుషుడు అనే భేదాలు లేకుండా అందరికీ సమానంగా మానవ హక్కులు కల్పించారన్నారు. ప్రతిఒక్కరూ ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా సమానత్వపు హక్కు, స్వాతంత్ర్యపు హక్కు, మత స్వాతంత్ర్యపు హక్కు, విద్యాహక్కు మొదలగునవి ఉపయోగించుకోవాలన్నారు. మానవ హక్కులను ఎవరైనా ఉల్లంఘిస్తే వాటిని కాపాడుకోవడం కోసం రాష్ట్ర జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి సత్వర న్యాయం పొందవచ్చని చెప్పారు. ఎదుటి వానికి ఇబ్బంది కలిగించే ఏ మాటలు, పనులు చేయకూడదని ఆయన సూచించారు. ఉచిత న్యాయ సలహాదారులు ఎస్.సుధీర్, డి.రవికిరణ్, జైలు పర్యవేక్షణాధికారి డి.వెంకటగిరి పాల్గొన్నారు. రవికిరణ్ ముద్దాయిలకు పండ్లు పంపిణీ చేశారు.

ఫలితం పదిలం కావాలని..

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- పోషకాహారం పంపిణీకి ఏర్పాట్లు
- ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక కార్యాచరణ
- జిల్లాలో సుమారు 24 వేల మంది విద్యార్థులు

భీమవరం: రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కసరత్తు ప్రారంభించింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 480 ఉండగా సుమారు 24 వేల మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ప్రత్యేక దృష్టి సారించారు. సీ, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ అమలుచేస్తున్నారు.

100 రోజుల ప్రణాళిక

టెన్త్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. విద్యార్థుల వెసులుబాటును బట్టి గంట చొప్పున అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. పాఠశాలలో ఒక్కో ఉపాధ్యాయుడికి 10 మంది విద్యార్థులను దత్తత ఇవ్వడంతో పాటు బాగా చదివే పిల్లలను 10 మంది వెనుకబడిన విద్యార్థులతో కలిసి చదివించేలా ఏర్పాట్లుచేశారు. అలాగే సీ,డీ గ్రేడ్ విద్యార్థులకు సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా నోట్స్‌ను తయారుచేసి విద్యార్థులతో రివిజన్ క్లాసులో చదివించేలా చర్యలు తీసుకున్నారు. ఆయా విద్యార్థుల ప్రగతిని దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి వివరిస్తారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో వ్యాకరణ అంశాలపై అవగాహన కల్పించి రోజూ ఒక్కో అంశంపై అభ్యాసన, ముఖ్యమైన వ్యాసాలు, లేఖలను చదివించడం, గ్రామర్ ప్రాక్టీస్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



విజయీభవ.. భీమవరం పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో తరగతి గదిలో విద్యార్థినులు

పక్కాగా నోట్ పుస్తకాల తనిఖీ

విద్యార్థుల వర్క్, నోట్ పుస్తకాలను ఆయా సబ్జెక్ట్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా తనిఖీ చేసి వాటిలోని తప్పులను సరిచేయాలి. వీటిని మండల విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడైనా ఉపాధ్యాయులు సక్రమంగా తనిఖీ చేయకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. పబ్లిక్ పరీక్షల్లో ఎక్కడా అవకతవకలు, అక్రమాలు జరిగే అవకాశం లేనందున విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి మార్కులు సాధించే అవకాశముంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

దాతల సాయంతో..

అదనపు తరగతులతో ఎక్కువ సమయం పాఠశాలల్లోనే ఉంటున్నందున విద్యార్థులు అలసిపోకుండా దాతల సహకారంతో మధ్యాహ్నం పోషకాహారం అందించే ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు చేస్తున్నారు. ఆయా పాఠశాలల పరిధిలోని దాతలను గుర్తించి వారి ద్వారా అల్పాహారం అందిస్తున్నారు. దీనిపై ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధతో..



జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. జిల్లాలో ఈ ఏడాది సుమారు 24 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక శ్రద్ధతో అదనపు తరగతులు నిర్వహించడమేగాక విద్యార్థులకు మధ్యాహ్నం స్నాక్స్ అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా సహకరించి తమ పిల్లల చదువుపై శ్రద్ధ తీసుకుంటే మంచి ఫలితాలు సాధిస్తాం.

– ఆర్.వెంకటరమణ, డీఈఓ, భీమవరం

మద్దిలో తెప్పోత్సవ శోభ



గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా క్షేత్రంలోని పుష్కరిణిలో ఆదివారం స్వామి తెప్పోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. గోపురం ఆకారంలో ప్రత్యేక అలంకరణ వాహనంపై తెప్పోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– జంగారెడ్డిగూడెం రూరల్



పంటల బీమా.. రైతుకు ధీమా

- ఏ కేటగిరీ కింద సాగు చేసినా ఒకే రీతిలో పరిహారం
- పంటల వారీగా నోటిఫికేషన్ జారీ
- ఖరీఫ్, రబీ సీజన్లకు వర్తింపు

ఏలూరు(మెట్రో): 2023–24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేసే బీమా కంపెనీలు, బీమా వర్తించే పంటల వివరాలపై ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసింది. రైతులు ఎటువంటి బీమా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఏలూరు జిల్లాలో దిగుబడి ఆధారిత పథకానికి ఓరియంటల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, వాతావరణ ఆధారిత పథకానికి యూనివర్సల్ సోంపో జీఐసీ లిమిటెడ్‌లు బీమా కంపెనీలుగా వ్యవహరిస్తాయి. ఖరీఫ్ కాలానికి దిగుబడి ఆధారిత కింద వరి పంటను గ్రామం యూనిట్‌గా, మినుమును జిల్లా యూనిట్‌గా తీసుకుంటారు. వాతావరణ ఆధారిత కింద పత్తిని మండల యూనిట్‌గా తీసుకుంటారు. అలాగే రబీ కాలానికి సంబంధించి దిగుబడి ఆధారిత కింద వరి పంటను గ్రామం యూనిట్‌గా, మొక్కజొన్న, పెసలు, మినుము, వేరుశనగ, నిమ్మను మండల యూనిట్‌గా తీసుకుంటారు. అలాగే నోటిఫై చేసిన జిల్లాల్లో ఖరీఫ్‌లో మిరప, పసుపు, జొన్న పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా దిగుబడి ఆధారంగానే పరిగణిస్తారు. పత్తి, వేరుశనగ పంటలను పూర్తిగా వాతావరణ ఆధారితంగా పరిగణిస్తారు. నోటిఫైడ్ జిల్లాల్లో నిమ్మ పంటలను వాతావరణ ఆధారిత బీమా పరిధిలోకి తీసుకొచ్చారు. నాటిన నాలుగో ఏడాది నుంచి నిమ్మ తోటలకు రబీ సీజన్‌లోనూ బీమా రక్షణ కల్పిస్తారు.



మరింత పారదర్శకత

దేశంలోనే అత్యల్ప ప్రీమియంతో బీమా కవరేజ్‌కు ముందుకొచ్చిన కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. జిల్లాలవారీగా కవరేజీ కల్పించే కంపెనీలతో పాటు నోటిఫైడ్ పంటల వివరాలతో ఇటీవల నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఖరీఫ్ సీజన్‌లో 15 పంటలకు దిగుబడి ఆధారంగా, 6 పంటలకు వాతావరణ ఆధారంగా, రబీ సీజన్‌లో 13 పంటలకు దిగుబడి ఆధారంగా, 4 పంటలకు వాతావరణ ఆధారంగా బీమా కల్పిస్తారు. పంటల బీమా లెక్కింపు, పరిహారం చెల్లింపుల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు మార్గదర్శకాల్లో కీలక మార్పులు చేశారు. నీటి వసతి, వర్షాధారం ప్రాతిపదికన కాకుండా ఇకపై పూర్తిగా వాతావరణం, దిగుబడి ఆధారంగానే బీమా రక్షణ ఉంటుంది. నోటిఫై చేసిన జిల్లాల్లో నోటిఫై చేసిన పంటలు నష్టపోయే రైతులకు ఒకే రీతిలో పరిహారం దక్కుతుంది. లెక్కింపు, చెల్లింపుల్లో ఎలాంటి అసమానతలు ఉండవు. అలాగే కొన్ని జిల్లాల్లో పెరిగిన సాగు విస్తీర్ణాన్ని బట్టి కొత్త పంటలను బీమా పరిధిలోకి తీసుకువచ్చారు. ఈ మేరకు మార్గదర్శకాల్లో మార్పులు చేయడంతో పాటు ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే అమలులోకి తెస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉత్సాహంగా ‘సాక్షి స్పెల్ బీ’ పరీక్షలు

- నాలుగు కేటగిరీల్లో పరీక్షల నిర్వహణ
- జిల్లా నలుమూలల నుంచి విద్యార్థుల హాజరు
- సబ్జెక్టులపై అవగాహన పెరిగిందని సంతోషం

SAKSHI MATH BEE 2023-24

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలోని సెంట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం ‘సాక్షి’ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సాక్షి స్పెల్ బీ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆయా పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ పరీక్షలను మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులపై నిర్వహించారు. 1వ కేటగిరీ 1, 2వ తరగతులు, 2వ కేటగిరీ 3,4 తరగతులు, 3వ కేటగిరీ 5,6,7 తరగతులు, 4వ కేటగిరీ 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించారు. తాడేపల్లిగూడెంతోపాటు నరసాపురం, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. ఈ పరీక్షలకు హాజరవ్వడం సంతోషంగా ఉందని, ఆయా సబ్జెక్టులకు సంబంధించి పట్టు సాధించాల్సిన విషయాలపై అవగాహన పెరిగిందన్నారు.



తాడేపల్లిగూడెంలో సాక్షి స్పెల్-బీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

టీచర్ల ప్రత్యేక తర్ఫీదుతో..



సాక్షి స్పెల్ బీ పరీక్షలు రాయడం బాగుంది. సబ్జెక్టును మరింత మెరుగుచేసుకునేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయి. మా టీచర్లు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు.

– కె.డింపుల్, 8వ తరగతి, ప్రతిభ ఇంగ్లిష్ మీడియం స్కూల్, జంగారెడ్డిగూడెం

సబ్జెక్టులపై పట్టు సాధించేలా..



సాక్షి స్పెల్ బీ పరీక్షలకు హాజరుకావడం వలన మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులపై మరింత పట్టు సాధించాలనే విషయం తెలిసింది. ఈ దిశగా ప్రయత్నిస్తాను.

–రోహిత్, ఆదిత్య ఇంగ్లిష్ మీడియం స్కూల్, 5వ తరగతి, తాడేపల్లిగూడెం

పరీక్షలు బాగా రాశాను



మా స్కూల్‌లో టీచర్లు చెప్పిన సబ్జెక్టుల్లోని ప్రశ్నలే ఉన్నాయి. పరీక్షలను బాగా రాశాను. వచ్చే సంవత్సరం మరింత మెరుగ్గా పరీక్షలకు సిద్ధమవుతా.

–కె.ప్రతిజ్ఞ, 6వ తరగతి, ఆదిత్య ఇంగ్లిష్ మీడియం, తాడేపల్లిగూడెం

చినవెంకన్న దర్శనంలో ‘ప్రొటోకాల్’ చిక్కులు

- ఇంజనీరింగ్ విభాగ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం
- చేతులెత్తేసిన పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బంది
- వీఐపీలు, దాతలు, గ్రామస్తులకు తప్పని ఇక్కట్లు

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఇంజనీరింగ్ విభాగ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం చూపుతున్నారు. శ్రీవారి దర్శనానికి ఆంక్షలు విధిస్తూ ఎక్కడికక్కడ గేట్లకు తాళాలు వేస్తున్నారు. దీంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల వ్యవహారశైలి ప్రభుత్వానికి మచ్చ తెచ్చేలా ఉంది. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రతి శని, ఆదివారాలు, పర్వదినాల్లో వేలాది మంది భక్తులు దర్శిస్తుంటారు. వారంతా శీఘ్ర, అతి శీఘ్ర, ధర్మ దర్శనాలు చేసుకుంటారు. ఇక వీఐపీలు, దాతలు, ఆలయ ధర్మకర్తలు, అధికారులు, గ్రామస్తులు ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని ప్రొటోకాల్ కార్యాలయం ద్వారా దర్శనానికి వెళతారు. అయితే ఇంజనీరింగ్ విభాగ ప్రధాన అధికారి ప్రొటోకాల్ కార్యాలయంపై, అక్కడి నుంచి వచ్చే భక్తుల రాకపోకలపై హుకుం జారీ చేశారు. దీంతో గత శని, ఆదివారాలు మాదిరిగా, ఈ వారం కూడా ప్రొటోకాల్ కార్యాలయం నుంచి స్లిప్పు తెచ్చిన వారినే ఆలయంలోకి అనుమతిచ్చారు. అయితే స్లిప్పులు రాస్తే తమకెక్కడ ఇబ్బంది కలుగుతుందోనన్న భయంతో ప్రొటోకాల్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది తలుపులకు గొళ్లాలు పెట్టుకుని లోపలే కూర్చున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కొందరికి మాత్రమే స్లిప్పులు రాసివ్వడంతో మిగిలిన వారంతా అక్కడే పడిగాపులు పడ్డారు. దీంతో దాతలు, వారి కుటుంబసభ్యులు సైతం విసిగిపోయారు. ఇదిలా ఉంటే గత శని, ఆదివారాలు దివ్యాంగులను సైతం ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది స్లిప్పులు తెస్తేనే దర్శనానికి పంపుతామని చెప్పడంతో వారు కూడా ఇబ్బంది పడ్డారు. ఈ వారం దివ్యాంగులకు మినహాయింపు ఇచ్చారు.



ప్రొటోకాల్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న భక్తులు (ఫైల్)



ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ప్రొటోకాల్ స్లిప్‌ను పరిశీలించి ఇంజనీరింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న హోంగార్డు (ఫైల్)

అనధికారికంగా విధుల నిర్వహణ

దేవస్థానం పరిపాలనా విభాగం ఉత్తర్వులు లేకుండానే ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది ఆలయంలో ప్రత్యేక విధులు నిర్వర్తిస్తున్నారు. దీనిపై కొందరు ఏఈఓలు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పెదవి విరుస్తున్నారు.

ఇక్కడే సమస్య ఎందుకు..

ప్రతి ఆలయంలోను ప్రొటోకాల్ కార్యాలయం ఉంటుంది. అయితే ఎక్కడా లేనివిధంగా ఇక్కడ సమస్య తలెత్తింది. ఇందుకు పరిపాలన విభాగంలో ఇంజనీరింగ్ విభాగ అధికారుల జోక్యమే కారణమని తెలుస్తోంది. దేవస్థానానికి ఆదాయం పెంచడం కోసం చర్యలు చేపట్టడం మంచిదేనని, అయితే వారు అవలంబిస్తున్న విధానాలు తప్పని పలువురు అంటున్నారు.

ప్రొటోకాల్ అధికారులకు నోటీసులు

శని, ఆదివారాలు ప్రొటోకాల్ కార్యాలయం తలుపులు ఎందుకు మూశారు, వీఐపీల ఫోన్లు ఎందుకు రిసీవ్ చేసుకోలేదో సమాధానం ఇవ్వాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ప్రొటోకాల్ ఏఈఓ, సూపరింటెండెంట్లకు ఆదివారం నోటీసులు జారీ చేశారు. దీంతో ఇదెక్కడి గొడవరా బాబోయ్ అంటూ అధికారులు తలలు పట్టుకున్నారు. ఇంజనీరింగ్ విభాగ అధికారులు, సిబ్బంది చేసిన పనికి తాము సమాధానం చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందని, వారు మాత్రం బాగానే ఉన్నారని మదనపడుతున్నారు. పరిపాలనా విభాగం నుంచి ఎటువంటి ఉత్తర్వులు లేకుండా, అనధికారికంగా రెండు వారాల నుంచి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇంజనీరింగ్ విభాగ అధికారిపై, ఆ విభాగ సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా నోటీసుల విషయం తెలుసుకున్న ఇంజనీరింగ్ విభాగ అధికారి తమ సిబ్బందిని ఆలయ విధులు విడిచి వెళ్లాలని ఆదేశించినట్టు తెలిసింది. దీంతో వారు మధ్యాహ్నం విధుల నుంచి వైదొలిగారు. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయనేది వేచి చూడాల్సి ఉంది.

క్యూలైన్ల మెయింటెనెన్స్ వారి బాధ్యత

ఆలయంలో క్యూలైన్ల మెయింటెనెన్స్, క్యూలైన్లలోని భక్తులకు మంచినీరు అందించడం, సెక్యూరిటీ విధులను చూసుకోవడం మాత్రమే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది బాధ్యతని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు వివరణ ఇచ్చారు. ప్రొటోకాల్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు.

12న గవర్నర్ రాక



గాలాయిగూడెంలో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఈఓ సుబ్బారావు

ఏలూరు (మెట్రో) : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 12న (మంగళవారం) ఏలూరు జిల్లాకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. దెందులూరు మండలం గాలాయిగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని, ఈ మేరకు అధికారులకు విధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్లు చేయాలనీ జిల్లా ఎస్పీని, గవర్నర్ పర్యటించే మార్గంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. సభాస్థలం, షామియానా, రోడ్డు మరమ్మతులు తదితరాలపై ఆర్అండ్‌బీ ఎస్ఈకు సూచనలు ఇచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను, అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు స్టాల్స్ ఏర్పాటుచేయాలన్నారు. గవర్నర్ పర్యటనను విజయవంతం చేసేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

సభాస్థలాన్ని పరిశీలించిన జెడ్పీ సీఈఓ

దెందులూరు : గాలాయిగూడెంలో శ్రీ కృష్ణా కన్వెన్షన్ హాలులో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించనుండగా, జెడ్పీ సీఈఓ సుబ్బారావు, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు ఆదివారం సభా స్థలాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

శ్రీవారి దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఒక ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రంలో ఈ నెల 3 నుంచి 6 వరకు జరిగిన శ్రీ భృగు, మరీచి, అత్రి, కశ్యప శిష్య సహిత విఖనస మహా ముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కుక్కను పెంచుకునేందుకు ఒప్పుకోలేదని ఆత్మహత్య

ఉండి: కుక్కను పెంచుకునేందుకు తండ్రి ఒప్పుకోలేదని మనస్తాపంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని యండగండికి చెందిన చాట్ల సలోమి(19) తండ్రి సామ్యూల్‌ను కుక్కను పెంచుకుందామని కొద్ది రోజుల నుంచి అడుగుతోంది. తండ్రి మందలించడంతో ఈ నెల 7న ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు వెదికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. 9వ తేదీ సాయంత్రం గ్రామంలోని లాకుల వద్ద సలోమి శవమై కనిపించింది. పోలీసులకు సమాచారం అందడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 10న పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. యువతి మృతిపై ఏఎస్సై ఏ.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెడుగుడు పోటీలు



బల్లిపాడు- అల్లూరు తేజ ఫ్రెండ్స్ మధ్య మ్యాచ్

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్తిపాలెం శివారు మామిడిగుంటలో వైఎంసీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. మొత్తం 12 జట్లు పాల్గొనగా నెల్లూరు (రాజా), నెల్లూరు(యాకోబ్), బాపట్ల(తేజ), బల్లిపాడు, విజయవాడ, కమతంవారిగూడెం, వైఎంసీఏ యూత్, మామిడిగుంట జట్లు లీగ్‌లోకి చేరాయి.

సమష్టిగా.. స్వావలంబన

- డ్వాక్రా రుణసాయంతో వ్యాపారం
- పనిలో సభ్యులంతా మమేకం
- వేల నుంచి మొదలై లక్షల్లో టర్నోవర్
- దేశ విదేశాల్లోని వారికి ఆర్డరుపై పిండి వంటల తయారీ
- స్వీట్లు, చాక్‌పీస్‌ల తయారీలో రాణిస్తున్న కోపల్లె డ్వాక్రా మహిళలు
- ఇంటి వద్దే పనిచేస్తూ నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఆర్జన



పిండి వంటలు తయారుచేస్తున్న సుధ డ్వాక్రా గ్రూప్ సభ్యులు



బూరెల కోసం పూర్ణం సిద్ధం చేస్తున్న సుధ డ్వాక్రా గ్రూప్ సభ్యులు



చాక్‌పీస్‌లు ఎండబెడుతున్న కారుణ్య డ్వాక్రా గ్రూప్ సభ్యులు



డ్వాక్రా మహిళలు తయారుచేసిన మసాలా దినుసుల ప్యాకెట్లు

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : ఖాళీగా ఉండే బదులు తెలిసిన పనేకదా అని అడుగు ముందుకేశారు. డ్వాక్రా రుణసాయంతో చిరు వ్యాపారాలు చేపట్టారు. కొద్దిపాటి మొత్తంతో ప్రారంభించి సభ్యులంతా సమష్టిగా పనిచేస్తూ లక్షల టర్నోవర్‌కు చేర్చారు. ఇంటి వద్దే పనిచేసుకుంటూ ఒక్కొక్కరు నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు కాళ్ల మండలం కోపల్లెకు చెందిన డ్వాక్రా సభ్యులు.

మాధుర్యం పంచే పిండి వంటలు

గ్రామంలోని సుధ గ్రూప్ సభ్యులు 2016లో సుధ స్వీట్స్ పేరిట సంప్రదాయ పిండి వంటల తయారీ ప్రారంభించారు. వినియోగదారుల ఆర్డరుపై మిఠాయి, జంతికలు, పాలకోవా, కజ్జికాయలు, సున్నుండలు, అరిసెలు, బూరెలు, జీడిపప్పు అచ్చులు తదితర వంటలు సిద్ధం చేస్తుంటారు. మొదట్లో కేవలం రూ.25 వేలతో మొదలుపెట్టిన వ్యాపారం ఎటువంటి ప్రచార ఆర్భాటం లేకుండానే ఏడేళ్లలో ఏడాదికి సుమారు రూ.40 లక్షలకు పైగా టర్నోవర్‌కు చేరుకుంది. గతంలో మంజూరైన రూ.10 లక్షలు, తర్వాతి రూ.20 లక్షల రుణసాయం వ్యాపార అవసరాలకే వెచ్చించినట్టు సభ్యులు తెలిపారు. నాణ్యతలో రాజీ పడకుండా పిండి వంటలు తయారుచేయడం ద్వారా మంచి గుర్తింపు పొందారు. స్థానికులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల్లోని తమ వారికి వీరి వద్ద ప్రత్యేకంగా పిండి వంటలు తయారుచేయించి పంపిస్తుంటారు. పెళ్లిళ్లు, సంక్రాంతి, ఇతర పండుగల సీజన్‌లో క్షణం తీరిక లేకుండా పనిచేస్తుంటారు. ఆర్డర్లు ఎక్కువగా ఉన్నప్పుడు మరికొందరికి పని కల్పిస్తున్నారు. ఖాళీ రోజుల్లో బూరెలు తయారు చేసి భీమవరంలోని పలు మెస్‌లు, కళాశాలలకు పంపిస్తుంటారు. ముడి సరుకు ఎంపిక నుంచి తయారీ వరకు అంతా సంఘ సభ్యులే చూసుకుంటారు. ఇంటి వద్దనే ఉంటూ ఖాళీ సమయంలో పిండి వంటల తయారీ ద్వారా సభ్యులు ఒక్కొక్కరు నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఆర్జిస్తున్నారు.

సరదాగా మొదలుపెట్టాం



ఇంటి వద్దనే కదా అని రూ.25 వేలతో ఏడేళ్ల క్రితం సభ్యులందరూ సరదాగా పిండివంటల తయారీ మొదలుపెట్టాం. నాణ్యతతో చేయడం వల్ల కొద్దిరోజులకే మంచి గుర్తింపు వచ్చింది. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో అసలు ఖాళీ ఉండదు. పెళ్లిళ్ల సారెలకు ఆర్డర్లు ఎక్కువగా వస్తుంటాయి.

– దంతులూరి లత, సుధ సంఘం ప్రెసిడెంట్, కోపల్లె

విజయవంతంగా నిర్వహిస్తున్నాం



మా సంఘ సభ్యులు అందరూ ఏడాది క్రితం చాక్‌పీస్‌ల తయారీ చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తున్నాం. దీనిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు కూడా కృషి చేస్తున్నాం. మాకు తోడ్పాటుగా ప్రభుత్వం నుంచి సబ్సిడీ, స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు చాక్‌పీస్ ఆర్డర్లు ఇప్పించేందుకు అధికారులు సహకరించాలని కోరుతున్నాం.

– దేవరెడ్డి లక్ష్మీదేవి, కారుణ్య సంఘం ప్రెసిడెంట్, కోపల్లె

మామ్.. చాక్‌పీస్

మామ్ పేరిట చాక్‌పీస్‌ల తయారీలో రాణిస్తున్నారు గ్రామంలోని కారుణ్య డ్వాక్రా సంఘం సభ్యులు. 16 ఏళ్ల క్రితం ఈ గ్రూపును ప్రారంభించగా సంఘ అధ్యక్షురాలు దేవరెడ్డి లక్ష్మీదేవి హోల్‌సేల్‌గా మసాలా దినుసులు కొనుగోలు చేసి వాటిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి షాపులకు సరఫరా చేస్తుంటారు. మరోపక్క ఆర్డరుపై పిండి వంటలు చేస్తుంటారు. ఏడాది క్రితం రూ.20 లక్షలు డ్వాక్రా రుణం మంజూరు కాగా సభ్యులంతా కలిసి ఇంటి వద్దనే కుటీర పరిశ్రమగా చాక్‌పీస్‌ల తయారీ చేపట్టారు. ఖమ్మం నుంచి జిప్సం ముడిసరుకును తీసుకువచ్చి నెలకు రెండు టన్నుల వరకు రంగురంగుల చాక్‌పీస్‌లు తయారుచేస్తున్నారు. భీమవరం, పరిసరాల్లోని దుకాణాలు, పలు స్కూళ్లకు వాటిని విక్రయిస్తున్నారు. బయటి మార్కెట్ ధరల కన్నా తక్కువకే తాము చాక్‌పీస్ బాక్సులు అందిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. మిగిలిన రోజులతో పోలిస్తే సంక్రాంతి, ఇతర పండుగల సమయాల్లో ముగ్గుల కోసం ఆర్డర్లు ఎక్కువగా ఉంటాయన్నారు. నెలకు మూడు లక్షల వరకు సరుకు తయారవుతుందని, పెట్టుబడి ఖర్చులు పోను సభ్యులకు మెరుగైన ఆదాయం వస్తోందని వివరించారు. బ్యాంకు రుణానికి సంబంధించి వాయిదా పోగా మిగిలిన సొమ్ములు కుటుంబ అవసరాలకు ఆసరా అవుతున్నాయన్నారు. పాఠశాలల నుంచి ఆర్డర్లు ఎక్కువగా వస్తే మరింత లాభసాటిగా ఉంటుందని వారు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు తమ చాక్‌పీస్‌లు ఆర్డరు ఇచ్చే దిశగా స్థానిక అధికారులు సహకరించి ప్రోత్సహించాలని సంఘ సభ్యులు కోరుతున్నారు.

కాపులకు గుర్తింపునిచ్చింది వైఎస్సార్‌సీపీనే

మంత్రి కారుమూరి



తణుకులో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న కాపు సంఘ నాయకులు

తణుకు టౌన్: రాష్ట్రంలో కాపులను గుర్తించి వారి ఆత్మ గౌరవం పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు చెప్పారు. ఆదివారం తణుకు రూరల్ మండలం తేతలిలో కాపు కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తేతలి కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలో గత ప్రభుత్వం వంగవీటి మోహన రంగా విగ్రహాలు ఏర్పాటు చేయకుండా అడ్డుకుందని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తణుకు వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో సొంత నిధులతో రంగా విగ్రహం ఏర్పాటుతో పాటు సొసైటీ రోడ్డుకు మోహనరంగా రోడ్డుగా పేరు పెట్టినట్లు చెప్పారు. తణుకు మండలంలోని దువ్వ, వేల్పూరు తదితర గ్రామాల్లో రంగా విగ్రహాలు ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, నాయకులు ఇందుగపల్లి బలరామకృష్ణ, పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు వంటిద్దు ఈశ్వరప్రసాద్, గాజుల కాశీ, తదితరులు పాల్గొన్నారు.

తణుకు పట్టణ శెట్టి బలిజ సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బాలం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం, కాపు యువత ఆధ్వర్యంలో..

తణుకు అర్బన్: స్థానిక సజ్జాపురం అండర్ గ్రౌండ్ ప్రాంతంలో కాపు సంఘం, కాపు యువత ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన కాపు వనసమారాధనలో మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజ జరిపిన అనంతరం మంత్రి కారుమూరి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకటరాయుడు, తణుకు పట్టణ అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వరప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ అడ్డాల అనంత బాబు, గాజుల కాశీ, కాకిలేటి హరనాథ్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అత్తిలి పట్టణ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, యాతం చంద్రశేఖర్, మద్దాల శ్రీనివాసరావు, పైబోయిన ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

కైకలూరు: యాదవ సోదరులు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. సీఎన్నార్ గార్డెన్స్‌లో నియోజకవర్గ శ్రీ కృష్ణ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చేబోయిన వీర్రాజు అధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఆదివారం ఉత్సాహంగా జరిగింది. మంత్రి కారుమూరి మాట్లాడుతూ అందరూ విద్యలో రాణించాలన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ యాదవ కల్యాణ మండపాలకు బీఎంఆర్ ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు, రాజ్యసభ నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, టీటీడీ సభ్యుడు నాగసత్యం, వనసమారాధన కమిటీ చైర్మన్ బూరుబోయిన మోహనరావు, సంఘ నాయకులు బుర్రల వెంకట నరసింహరాజు, గురజాల రవి, బూరుబోయిన శ్రీనివాసరావు(బీఎస్సార్) సర్పంచులు భట్రాజు శివాజీ, ఉలిసి వసంతకుమారి, మాజీ జెడ్పీటీసీలు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, నున్న రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలి



వెంకట్రామన్నగూడెంలో కాపు వన సమారాధనలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కాపులు తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని వెంకట్రామన్నగూడెం బండారు నాగన్న వ్యవసాయ క్షేత్రంలో కాపు కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ కాపులు 20–25 ఏళ్ళ క్రితం వరకు విద్యలో వెనుకబడ్డారన్నారు. అప్పట్లో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయానికి పరిమితమయ్యారని గుర్తు చేశారు. సమాజంలో వస్తున్న మార్పుల కనుగుణంగా ప్రతి ఒక్కరిలోనూ చైతన్యం రావడం, ప్రభుత్వం సైతం పిల్లల చదువుకు సహకారం అందిస్తుందన్నారు. తొలుత శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్తీక దామోదరుని పూజలో పాల్గొని, ఆశీస్సులు అందుకున్నారు. కార్తీక వన సమారాధనకు తోట ఏర్పాటు చేసిన బండారు నాగన్న కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పసల కనకసుందరరావు, యాళి నాని, మున్సిపల్ మాజీ చైర్మన్ ఈతకోట తాతాజీ, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, కాపు నాడు జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు గుండుబోగుల నాగు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకటరమణ, నాయకులు కొట్టు విశాల్, మాకా శ్రీనివాసరావు, మారిశెట్టి అజయ్‌బాబు, గార్లపాటి వీరకుమార్, పసల కొండ, నరిశే సోమేశ్వర రావు, ఆకుల ధనశేఖర్, నంద్యాల కృష్ణమూర్తి, బండారు నాగేశ్వరరావు, బండారు ప్రసాద్, బండారు సత్యనారాయణ, బండారు వెంకటేశ్వర రావు, బండారు ఆంజనేయులు, బండారు గంగబాబు, బండారు సత్యనారాయణ, యెగ్గిన నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు చేయూతనందించాలి

మాజీ మంత్రి,
ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు



మార్టేరులో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న పంచగ్రామ రెడ్డి సేవా సంఘం సభ్యులు

పెనుమంట్ర: వృద్ధులు, పేద విద్యార్థులను ఆదరించడం ద్వారా రెడ్డి సేవా సంఘ సభ్యులు మరిన్ని సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం మార్టేరులో పంచగ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు సభ్యులు కృషిచేయాలని వారి భవిష్యత్‌కు బంగారుబాటలు వేయాలని అన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలలో సమూల మార్పులు తీసుకొచ్చి పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులకు వెళ్లాలని సూచించారు. పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు కేకేఆర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర రెడ్డి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తాడి భీమారెడ్డి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.వేణుగోపాలరెడ్డి, జిల్లా కార్యదర్శి గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, మార్టేరు –1 ఎంపీటీసీ కర్రి అనురాధ జోగిరెడ్డి, మార్టేరు ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు సత్తి వెంటకరెడ్డి, సత్తి విష్ణుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతాయి

పెనుగొండ: కార్తీక వన సమారాధనలో ఐక్యతను చాటి చెబుతాయని చెరకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం పెనుగొండ ఏఎంసీలో నిర్వహించిన వెలమ కార్తీక వన సమారాధనలో పాల్గొని చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరక్టరు కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు(నానాజీ), రంభ సూరిబాబు, పోడూరి రామయ్య, మాజీ జడ్పీటీసీ రొంగల రవికుమార్ పాల్గొన్నారు. సిద్ధాంతంలో శ్రీనివాస భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు వన సమారాధన నిర్వహించారు. వడలిలో కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు.

సమాజ శ్రేయస్సుకు క్షత్రియులు పాటుపడాలి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వనసమారాధనలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

పాలకొల్లు అర్బన్: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ సమాజ అభివృద్ధికి క్షత్రియులు పాటుపడాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ కల్యాణ మండపంలో ఆదివారం కార్తీక వనసమారాధన జరిగింది. ముందుగా రుద్రరాజు రామరాజు దంపతులు ఉసిరిచెట్టుకి పూజలు చేశారు. ఈ సందర్భంగా 500 మంది వృద్ధులు, వితంతువులకు పింఛన్లు, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ప్రముఖ కవి బీఎస్ఎన్ఎల్ రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), టీటీడీ బోర్డు మెంబర్ గాదిరాజు వెంకట సుబ్బరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాస రాజు, వశిష్ఠ మైరెన్స్ గ్రూప్ చైర్మన్ నడింపల్లి శ్రీనివాసరాజు, మాజీ ఎమ్మెల్యే బి.విష్ణుకుమార్‌రాజు (వైజాగ్), ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, అడిషనల్ ఏఎస్పీ వెంకటేశ్వరరావు, ఆడిటర్ రామారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి డా. కేఎస్‌పీఎన్ వర్మ, కోశాధికారి కలిదిండి వెంకట కృష్ణవర్మ, సమితి పూర్వాధ్యక్షుడు రామరాజు, వేగేశ్న రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ..

శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏఎంసీ ఆవరణలో జరిగిన కార్తీక వన సమారాధనలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి పాల్గొన్నారు. సంఘీయులకు కల్యాణ మండపం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించి, నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అడబాల లేఅవుట్ సమీపంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో గుడాల గోపి పాల్గొన్నారు.

కళకళలాడిన బీచ్‌లు

మొగల్తూరు: కార్తీక మాసం చివరి ఆదివారం మండలంలోని పేరుపాలెం, కేపీ పాలెం సాగరతీరాలు సందర్శకులతో కళకళలాడాయి. తుపాను కారణంగా పేరుపాలెం బీచ్‌కు సందర్శకులకు ఈ నెల 3 నుంచి 8 వరకూ అనుమతులు లేకపోవడంతో ఆఖరి ఆదివారం అధికారులను అనుమతించారు. దీంతో ఈ ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మాత్రమే సముద్ర స్నానాలకు అనుమతించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని వేగవరం తూర్పుపేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. భద్రాచలంలో వెంకటేశ్వర కాలనీకి చెందిన ఉజ్జగిరి క్రాంతికుమార్ వడ్రంగి పనులు చేసేవాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై(స్కూటీ) స్వగ్రామం నుంచి జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. వేగవరం వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతి మృతిపై కేసు నమోదు

ఉండి: మండలంలోని చిలుకూరుకు చెందిన బత్తుల సుశీల(23) కాలువలో పడి మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సుశీల మానసిక వైకల్యంతో బాధపడుతోంది. ఈ నెల 9న రాత్రి నుంచి ఆమె కనిపించకపోవడంతో ఆదివారం యువతి మేనమామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామంలోని కాలువలో ఆమె మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఆమె మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

అలరించిన భక్త రామదాసు హరికథ



హరికథ గానం చేస్తున్న నేమాని నాగలక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్వితీయ హరికథా సప్తాహంలో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మి నగర్‌లో మాజీ కౌన్సిలర్ కర్రి ప్రభాకర్ బాలాజీ నివాసం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన భక్త రామదాసు హరికథ భక్తులను విశేషంగా అలరించింది. నేమాని నాగలక్ష్మి హరికథా గానం చేయగా, సరస్వతుల హనుమంతరావు మృదంగం, వీరా శివప్రసాద్ వయోలిన్‌తో సహకరించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

తణుకులో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య సేవలను అందిస్తున్న వైద్యులు

తణుకు: పట్టణానికి చెందిన శ్రీభాను తేజ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జాతీయ రహదారి ఆనుకుని ఏర్పాటు చేసిన కాపు వనసమారాధన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్యులు సోడిశెట్టి తేజశివ కుమార్ ఉచితంగా వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమకంలో పులిగోరు రాజేష్, కనికెళ్ల కిశోర్, మాంద్రు మాక రాజేష్ సహకారం అందజేశారు.

వల్లూరుపల్లిలో 'వికసిత్ భారత్'

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు మండలం వల్లూరుపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సభకు సర్పంచ్ దంగేటి రామారావు అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను, ప్రజలకు ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్ అన్నయోజన, ఉపాధి హామీ పథకం, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, విశ్వకర్మ యోజన తదితర పథకాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను డిజిటల్ వాహనంలో ప్రదర్శించారు. దత్తు ప్రసాద్, ఇమ్మండి శ్రీను, కర్రి గిరీష్ రెడ్డి, ఆరాధ్యుల అంజి, మారిశెట్టి నరసింహమూర్తి, బెనర్జి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



ఉమాసిద్దేశ్వరునికి లక్షబిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: కార్తీకమాసం సందర్భంగా అత్తిలి శ్రీ ఉమాసిద్దేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం లక్షబిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన తలారి రాము దంపతులతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, లక్ష కుంకుమార్చన, రుద్రహోమం, సుందరకాండ పారాయణం, జ్యోతిర్లింగార్చన, శాంతి కల్యాణం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖర శర్మ, సాయి, ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు లక్షబిల్వార్చన పూజాధికాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు యండగండిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఉండి: యండగండిలో సోమవారం ఉదయం 9 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు ఆదివారం చెప్పారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. ఉదయం 10:30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్వీకరిస్తారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని కోరారు.

ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను సన్మానిస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు



కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న నీలపాల దినేష్ యాదవ్, యాదవ సంఘ సభ్యులు

తణుకు: కార్తీకమాసం పురస్కరించుకుని తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో పలు చోట్ల ఆదివారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వన సమారాదనలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. తణుకులో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంత రావు, ప్రవనకర్త నందిపాటి రవీంద్రాచారి పాల్గొన్నారు. తణుకు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మందరపు నాగమనోహరాచారి అధ్యక్షతన నిర్వహ/ ంచారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

అత్తిలిలో..

అత్తిలి: శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం అత్తిలి ఆశ్రమ ప్రాంగణంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. పీఠం కమిటీ సభ్యులు సహకారంతో నిర్వహించిన వనసమారాధనలో అధిక సంఖ్యలో పీఠం సభ్యులు హాజరయ్యారు.



పెదతాడపల్లి వనసమారాధనలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో..

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పడాల మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన సమారాధనలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాత్రికేయులు సమాజం పట్ల బాధ్యతగా నడుచుకుంటూ మంచి సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు పసల కనకసుందరరావు, యాలి నాని, మున్సిపల్‌మాజీ చైర్మన్ ఈతకోట భీమశంకరరావు (తాతాజీ), జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, కాపునాడు జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు, మున్సిపల్‌మాజీ వైస్‌చైర్మన్ కర్ భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు గుండుబోగుల నాగు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకటరమణ, నాయకులు కొట్టు విశాల్, మాకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదతాడేపల్లిలో..

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లిలోని గాయత్రీ కల్యాణ మండపంలో బ్రాహ్మణ సేవా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాస గౌరీ, నందికేశుని నోములు జరిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ వేర్వేరుగా హాజరై మాట్లాడారు. అందరూ ఐకమత్యంగా ఉండి, సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పుల్లాభొట్ల వెంకట సూర్యనారాయణమూర్తి, కోశాధికారి ప్రవా శ్రీనివాస్, బాపయ్య శర్మ, తల్లాప్రగడ నరసింహారావు, అత్తిలి నాగభాస్కర శ్రీనివాస్, రౌతుల రాజా, కలిగొట్ల శ్రీనివాస్, పరశురామం, దశిక మురళీకృష్ణ, ఆడిటర్లు ధూళిపాళ విశ్వనాథ్, వేలమూరి దివాకర్ పాల్గొన్నారు. అలాగే, పట్టణ శివారు కొండాలమ్మ గుడి సమీపంలో పైబోయిన రఘు తోటలో యాదవ సంఘం, స్వర్ణకార సంఘం, కొమ్మన వారి కుటుంబీకుల కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. సోమా శంకర్, బొద్దాని శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, దండుబోయిన చిన్న, పోలిమోను సూరిబాబు, మందాల శ్రీనివాస్, మరిడి చిన్న, మరిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గ స్థాయి యాదవుల కార్తీక వనసమారాధన ఆదివారం పైబోయిన రఘు తోటలో యాదవ యువ సమితి జిల్లా అధ్యక్షులు నీలపాల దినేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం మహిళలు, పిల్లలు, నాయకులు పాల్గొని వివిధ ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సహపంక్తి భోజనాలు చేశారు. నియోజకవర్గంలోని పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. సోమా శంకర్, బొద్దాని శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, దండుబోయిన చిన్నా, పి.సూరిబాబు, ఎం.శ్రీనివాస్, మరిడి చిన్ని, వంక కామేశ్వరరావు, హరనాథ్, గోపి, రావణ, నాగు పాల్గొన్నారు.

పంచారామదర్శినికి కదిలిన బస్సులు



పంచారామదర్శినికి బయలుదేరే బస్సులు వద్ద భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక మాసం సందర్భంగా పంచారామదర్శిని యాత్రకు తాడేపల్లిగూడెం డిపో నుంచి మూడు ఆర్టీసీ బస్సుల్లో భక్తులు తరలివెళ్లారు. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ బస్సులు పరిసర గ్రామాలైన నల్లజర్ల, గణపవరం నుంచి కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రసిద్ధ శైవక్షేత్రాలు అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరంలలో స్వామివార్లను దర్శించుకుని సోమవారం రాత్రికి తాడేపల్లిగూడెం చేరుకుంటారని వెల్లడించారు. అదే విధంగా ఈ నెల 24న డిపో నుంచి అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నామని, భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

సంచార వైద్యశాల ద్వారా సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం 12 మంది వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు షేక్ మస్తాన్ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కోశాధికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగా వీధిగా సొసైటీ రోడ్డు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో వంగవీటి మోహనరంగా వీధిగా నామకరణం చేసిన రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడ్డ మహామనిషి వంగవీటి మోహనరంగా అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు సొసైటీ రోడ్డును వంగవీటి మోహనరంగా వీధిగా అధికారికంగా మార్పించిన సందర్భంగా ఆదివారం ఆ రోడ్డుకు మంత్రి కారుమూరి చేతులమీదుగా రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల ఆరాధ్య దైవంగా పిలవబడే రంగా విగ్రహం తణుకులో ఏర్పాటు చేయమని కాపు సంఘ నాయకులు అడిగిన వెంటనే అప్పటి సొసైటీ రోడ్డు మునిసిపల్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేశానని, మళ్లీ విగ్రహ ప్రారంభం రోజున అదే కాపు సంఘ నాయకులు ఈ వీధిని రంగా వీధిగా మార్పించాలని కోరిన వెంటనే ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి అధికారికంగానే రంగా వీధిగా నామకరణం చేయించినట్లు చెప్పారు. బడుగుల కోసం పోరాడిన బలమైన నాయకుడిని నిరాహారదీక్ష సమయంలో కొందరు దుండగులు అర్ధరాత్రి గొడ్డళ్లతో నరికి చంపించిన విషయం.. ఎవరు చంపించారో? కూడా ప్రజలు, కాపు వర్గాలకు తెలుసునని అన్నారు. తన పరిచయాలన్నీ అధిక శాతం కాపులతోనే ముడిపడి ఉన్నాయని కాపు వర్గీయులకు ఏ పనిచేయాలన్నా వెంటనే చేయిస్తానని హామీ ఇచ్చారు. అత్తిలిలో రంగా విగ్రహం ఏర్పాటు చేయనున్నామని ప్రారంభోత్సవానికి ఇండియన్ టీం క్రికెటర్ అంబటి రాయుడు హాజరవుతున్నారని వివరించారు. జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ మాట్లాడుతూ కాపులు అధికంగా ఉన్నప్పటికీ తణుకులో ఇప్పటివరకు కాపు నేత విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోలేకపోయామని, గత టీడీపీ హయాంలో కాపు యువత తాము దైవంగా భావించే విగ్రహాన్ని రాష్ట్రపతి రోడ్డులో పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా పెట్టిన సందర్భంలో అప్పటి పాలకులు మునిసిపల్ సిబ్బందితో విగ్రహాన్ని తొలగించి మునిసిపల్ కార్యాలయంలో మూలన పడేసిన విషయాన్ని తణుకులో కాపు వర్గాలకు గుర్తుందన్నారు. అడగిన వెంటనే సొంత నిధులతో మంత్రి కారుమూరి కాపునేత రంగా విగ్రహాన్ని ఏర్పాటుచేశారని కొనియాడారు. ముందుగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రంగా వీధి అని తెలిపే శిలాఫలకాన్ని, రంగా వీధిగా బోర్డును మంత్రి కారుమూరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు, పట్టణ అధ్యక్షులు వంటెద్దు ఈశ్వరప్రసాద్, కాపు సంఘ నియోజకవర్గ కన్వీనర్ అడ్డాల అనంతబాబు, నాయకులు గాజుల కాశీ, బాబూజీరావు, బెజవాడ సూరి, బడేటి సాయి, కొమ్మన శ్రీనివాస్, ఆకుల సతీష్, ఆకుల రాజు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణిప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అత్తిలి పట్టణ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, పోతుల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమాసిద్ధేశ్వరుని సేవలో మంత్రి కారుమూరి



ఉమాసిద్ధేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: స్థానిక శ్రీ ఉమాసిద్ధేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం నిర్వహించిన లక్షబిల్వార్చన కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మంత్రి కారుమూరికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ సూర్యభగవానుడిని మంత్రి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న ఆధ్వర్యంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావును సత్కరించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ వేద ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, కంకటాల సతీష్, రంభ సూరిబాబు, కూనపరెడ్డి జయరాజు, మద్దాల శ్రీనివాస్, గర్నిపూడి సర్వేశ్వరరావు, దుడే ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పాలూరులో..

మండలంలోని పాలూరుగ్రామంలో నిర్వహించిన గౌరీ పార్వతుల కల్యాణోత్సవానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

సామూహిక సత్యదేవుని వ్రతాలు



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసి ఉన్న స్వయంభూ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారి సన్నిధిలో కార్తీక మాసం త్రయోదశి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి స్వామివారి ఆలయములో సుమారు 600 మంది దంపతులు వ్రత పూజలు చేశారు. ఈ కార్యక్రమం దేవస్థానం వేదపండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ, అర్చకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదం, సత్యనారాయణస్వామి ప్రతిమలు, మండపారాధన వస్త్రాలను కృష్ణా జిల్లా తాడినాడ గ్రామానికి చెందిన దాత వేగేశ్న వెంకట సూర్య సత్యనారాయణరాజు (ఏడుకొండల రాజు) అందించారు. సత్యదేవుని వ్రతాలు సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా పలు జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



తాడేరు ఆలయంలో సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భీమవరం అర్బన్: తాడేరులో కొలువైయున్న శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం లక్ష బిల్వార్చన పూజలు చేశారు. ముందుగా స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, గోక్షీరాభిషేకం, సహస్ర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన పూజలు చేసి భక్తుల దర్శనానికై అనుమతించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో సామూహికంగా గౌరీ, విఘ్నేశ్వర, శని తదితర పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ ,ఛైర్మన్ తిరుమల నాగేశ్వర రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి గంధం సత్యనారాయణ, చవాలి శివ వరప్రసాద్, కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందు కు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తీకమాసం కావడంతో పేరుపాలెం బీచ్‌కు వెళ్లే సందర్శకులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు రాకతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నందీశ్వరుడికి అభిషేకాలు

ఆకివీడు: కార్తీక త్రయోదశి సందర్భంగా స్థానిక మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి ఆదివారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వయంగా అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. మల్లేశ్వరుడికి పంచహారతులు అందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, దేవస్థానం చైర్మన్ గునుకుల కొండయ్య, బెజవాడ మహేష్ నాగేంద్రకుమార్, బాలు, నక్కా శ్రీను, డీ.వాణీ, రేవతి పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని దివ్యాంగుల జాతీయ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాడి నటరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు పీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా దివ్యాంగుల సమావేశం పి.రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ దివ్యాంగుల గుర్తింపు కోసం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్‌లో అనేక ఇబ్బందులు వస్తున్నాయని, అర్హులకు పెన్షన్ రావడం లేదన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న

భీమవరం (ప్రకాశంచౌక్): అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని వైఎస్సార్ సీపీ నాయకుడు గ్రంధి రవితేజ అన్నారు. పంచారామ క్షేత్రాలలో ఒకటైన భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసం సందర్భంగా వచ్చే భక్తులకు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, ఆలయ ఈవో రామకృష్ణంరాజు, చెల్లబోయిన సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సాంకేతిక సందడి



డిజిటల్ బోర్డుపై పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయిని

నరసాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక సందడి నెలకొంది. గతంలో కేవలం బ్లాక్‌బోర్డుపై మాత్రమే పాఠాలకు అలవాటు పడిన పిల్లలకు పెరుగుతున్న సాంకేతిక ప్రపంచంలో కొత్త తరహా బోధనను ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ అనేది ప్రతి ఒక్కరి ఇంట్లో ఉంటుంది. అలాగే యూట్యూబ్ వంటి సైట్స్ అందరికీ తెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేసిన పాఠశాలల్లో ప్రత్యేకంగా డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే బడి పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. మధ్యాహ్న భోజనం, విద్యాసామగ్రితో పాటు, దుస్తులు విద్యార్థులకు సకాలంతో అందుతున్నాయి. ప్రతీ ఏటా అమ్మఒడి పథకం కింద డబ్బులు తల్లుల ఖాతాల్లో జమవుతున్నాయి. ఇప్పటికే ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్స్‌తో విద్యాబోధన జరుగుతుంది.

ప్రత్యేక పరికరాల ఏర్పాటు

ఇప్పటివరకూ అన్ని పాఠశాలల్లో ఉన్న బ్లాక్ బోర్డు, చాక్ పీస్‌లస్థానంలో నాడు–నేడు పథకంలో భాగంగా తొలుత గ్రీన్‌బోర్డును, తదనంతరం డిజిటలైజేషన్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీలు) ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్ స్క్రీన్లతో బోధన జరిపేందుకు అనుగుణంగా ఇప్పటికే ఉపాధ్యాయులకు కూడా శిక్షణను అందించారు. ఇదే తరహాలో ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను అందించారు. వీటి ఏర్పాటుతో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌గా పాఠశాల విద్య ప్రథమ స్థానంలోకి చేరడంతో పాటు డిజిటల్ బోధనలో మంచి ఫలితాలను కూడా అందిస్తుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు డిజిటల్ విద్యపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

పాఠాలన్నీ అర్థమవుతున్నాయి

డిజిటల్ బోర్డుమీద చెబుతున్న పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. అన్ని సబ్జెక్టులు మాస్టార్లు కూడా కేవలం చెప్పడమే కాకుండా అర్థమయ్యే విధంగా చూపించడం చాలా బావుంది. ఇలా ఎప్పుడూ పాఠాలు వినలేదు. లెక్కలు, సైన్స్, సోషల్ అనీ సబ్జెక్టులు మా అందరికీ బాగా అర్థం అవుతున్నాయి.

– గన్నాబత్తుల లక్ష్మీకల్యాణ్, పదో తరగతి విద్యార్థి